

విద్యార్థులకు మాక్ పోల్



సోమల జూనియర్ కళాశాల : మేమే ఓటర్లం, పోలింగ్ అధికారులం, ఏజెంట్లం

జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లో, మంగళవారం మాక్ పోల్ నిర్వహించారు. ఎన్నికలు, ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. డీఈవో విజయేంద్రరావు ఆధ్వర్యంలో ఎంఈవోలు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ అధికారులు, రాజకీయ పార్టీల తరపున ఏజెంట్లు, బందోబస్తు విధుల్లోనూ, ఓటర్లుగానూ విద్యార్థులే పాల్గొన్నారు. తద్వారా సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించి అన్ని అంశాలపైనా అవగాహన కల్పించారు.

- చిత్తూరు (సెంట్రల్)



మేము ఓటేశామోచ్: కార్వేటినగరంలో నమూనా ఓటు వేసిన విద్యార్థినులు

రోజా ఉక్కిరిబిక్కిరి

అసంతృప్తులు, ఆరోపణలతో



సరిగ్గా ఎన్నికల వేళ సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకతతో మంత్రి రోజా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్‌కు ఢోకా లేదని నిశ్చింత ఫీలవుతున్న తరుణంలో మంగళవారం నలుగురు జడ్పీటీసీ సభ్యులు మంత్రికి వ్యతిరేకంగా జడ్పీ సమావేశంలో గళం విప్పి తమను అణగదొక్కేస్తున్నారని ఆరోపించారు. పుత్తూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా వున్న దళిత మహిళ భువనేశ్వరి ఏకంగా అవినీతి ఆరోపణలే చేశారు. చైర్‌పర్సన్ పదవి కోసం తన నుంచీ రూ. 40 లక్షలు తీసుకున్నారని, పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వెనక్కు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆమె చేసిన ఆరోపణలు జిల్లావ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. ఎన్నికల సమయంలో సొంత పార్టీ మహిళా నాయకురాలే ఈ ఆరోపణ చేయడం అధికార పార్టీని ఇరుకునపెట్టింది.

రోజాకు టికెట్ వద్దు... ఇస్తే ఓడిపోవడం ఖాయం

మంత్రి రోజాకు ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ఇవ్వవద్దని సీఎం జగన్‌ను కోరారు వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి. చిత్తూరులో జడ్పీ సమావేశం అనంతరం ఆయన నింద్ర జడ్పీటీసీ మల్లీశ్వరితో కలసి మీడియాతో మాట్లాడారు. 2012లో తాను వడమాలపేట మండల వైసీపీ కన్వీనర్‌గా నియమితున్నయ్యానని, 2014 ఎన్నికల్లో తమ మండలంలో వైసీపీకి 1550 ఓట్లు మెజారిటీ తెప్పించామన్నారు. ఆ ఎన్నికల్లో రోజా 858 ఓట్లతో గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. 2014లో తాను వడమాలపేట ఎంపీపీ అయ్యానని, పార్టీ కోసం కష్టపడి పనిచేశానన్నారు. ఆ కారణంగా 2019 ఎన్నికల్లో తమ మండలంలో వైసీపీకి 3330 మెజారిటీ వచ్చిందని,





అప్పుడు కూడా రోజా గెలిచింది కేవలం 2800 ఓట్లతోనని గుర్తు చేశారు. రెండుసార్లు ఆమె గెలుపునకు తానే కారణమన్నారు. దానికి ప్రతిఫలం తమకు నిధులు రానివ్వకుండా చేయడం, గది లేకుండా చేయడం, అరెస్టులు చేయించడమా అని ప్రశ్నించారు. జగన్‌ను చూసి ఆమె గెలుపుకోసం పనిచేశామని, ఆయన రోజాకు మంత్రి పదవి కూడా ఇచ్చారని అయినా ఆమె తీరు మారలేదన్నారు. తమను వేధిస్తోందన్నారు. ఈసారి టికెట్ ఇస్తే ఓడిపోతుందని జగన్‌కు చెప్పాము. ఆయన మౌనంగా వున్నారని, అయినా మీడియా ద్వారా జగన్‌కు మళ్ళీ చెబుతున్నామన్నారు. నగరిలో వేరే ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుస్తారని, రోజాకు ఇస్తే మాత్రం ఓడిపోవడం ఖాయమన్నారు.

పదవి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలన్న పుత్తూరు కౌన్సిలర్

అణగదొక్కేస్తున్నారని జడ్పీ మీటింగులో సభ్యుల మాటల దాడి

టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమని వెలుపల వ్యాఖ్యలు

మంత్రిపై సొంత పార్టీలో మరింత పెరిగిన వ్యతిరేకత



చిత్తూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):పుత్తూరు మున్సిపల్ ఎన్నికల్లో చైర్‌పర్సన్ పదవి కోసం రోజాను సంప్రదించగా రూ. 70 లక్షలు అడిగారని, తాను మూడు విడతలుగా ఆమె సోదరుడు కుమారస్వామిరెడ్డి పంపిన మనిషి వద్ద రూ. 40 లక్షలు అందజేశానని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆరోపించారు. తన వద్ద డబ్బు తీసుకుని కూడా తనకు పదవి కేటాయించలేదని, రెండున్నరేళ్ళ తర్వాత ఇస్తామని నమ్మించారని ఆమె ఆరోపించారు. గతేడాది సెప్టెంబరుతో రెండున్నరేళ్ళ గడువు పూర్తయిందని అయినా పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వెనక్కు ఇవ్వడం లేదని ఆరోపించారు. మంత్రి రోజాను అడిగితే ఆమె సోదరుని అడగమని చెబుతున్నారని, ఆయన్ను అడిగితే డబ్బులు ఇవ్వకపోగా ఆయన అనుచరులు వేధిస్తున్నారని వాపోయారు. దళిత మహిళనైన తనకు సీఎం జగన్ న్యాయం చేయాలని కోరారు.ఇదిలా వుండగా చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో నగరి, వడమాలపేట, నింద్ర, పుత్తూరు జడ్పీటీసీ సభ్యులు తమకు మండలాల్లో ఎలాంటి ప్రాధాన్యతా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయాల్లో గదులు కూడా కేటాయించలేదని,అభివృద్ధి పనులకు నిధులు కూడా ఇవ్వడం లేదన్నారు. జడ్పీలో పనులు మంజూరు చేయించుకున్నా మంత్రి ఇంజనీరింగ్ అధికారులకు చెప్పి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై జడ్పీ సమావేశాల్లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చివరికి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసినా వారు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యర్థుల దాడికంటే సొంత పార్టీ నేతల నుంచే మంత్రి రోజా ఎక్కువగా దాడికి గురవుతున్నారు. సొంత నియోజకవర్గంలో తన పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో రోజాకు, పలు మండలాల్లోని పార్టీ నేతలకూ నడుమ విభేదాలు పొడసూపాయి. అవి కాలక్రమేణా అంతరం పెంచాయి. ఆమెను వ్యతిరేకిస్తూ బలమైన నేతలు బహిరంగ కార్యకలాపాలు సాగించారు. ఆమెకు టికెట్ ఇవ్వొద్దని అధినేతను పదేపదే కోరారు. అధినేత కూడా ఆమె వ్యతిరేక వర్గానికి చెందిన కేజే శాంతికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టు, రెడ్డివారి చక్రపాణిరెడ్డికి శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ పదవిని కట్టబెట్టడం ఆమెకు షాక్ ఇచ్చింది. అయితే ఎన్నికలు సమీపించాక అధినేత ఆమె పట్ల ప్రసన్నంగా వుండి టికెట్ విషయంలో అభయం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యతిరేకవర్గం కూడా మౌనంగా వుండడంతో ఆమె టికెట్‌కు ఢోకా లేదని, వ్యతిరేకవర్గం కూడా కాస్త తగ్గినట్టు అందరూ భావించారు. కానీ మంగళవారం నాటి పరిణామాలు సొంత పార్టీలో ఆమె పట్ల వ్యతిరేకత తగ్గకపోగా తారస్థాయికి చేరినట్టు నిరూపించాయి. ఆధిపత్యంలో ఒకరినొకరు దెబ్బతీసుకోవడం సహజమే అయినా సొంత పార్టీకి చెందిన దళిత మహిళా కౌన్సిలర్ తనకు పదవి ఇస్తామని మంత్రి డబ్బు తీసుకున్నారని ఆరోపించడం వైసీపీలో కలకలం రేపింది. డబ్బు తీసుకుని పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వాపస్ చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించడం అధికార పార్టీని ఆత్మరక్షణలో పడేసింది.మంత్రి రోజాపై ఆ ఆరోపణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.టికెట్ అవకాశాలు చేజారినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సొంత పార్టీ దళిత మహిళా నేత చేసిన ఆరోపణలు ప్రత్యర్థి పార్టీలకు ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారనున్నాయి. అవి ఆమెను, పార్టీని కూడా ఇరుకున పెడతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి సరిగ్గా ఎన్నికల తరుణంలో ఈ పరిణామాలు మంత్రి రోజాను తీవ్రంగా ఇబ్బంది పెట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

ఆత్మరక్షణలో అధికార పార్టీ నేతలు

జడ్పీ మిగులు బడ్జెట్ రూ.692.90 కోట్లు

రాబడులు రూ.4,732.34 కోట్లు

వ్యయం రూ.4,039.44 కోట్లు

సర్వసభ్య సమావేశంలో ఆమోదం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23:జిల్లా పరిషత్తు (అనుబంధశాఖల) 2024-25వార్షిక బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశం జరిగింది. రూ.692.90 కోట్లమిగులుతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కుసభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మొత్తం రాబడులుగా రూ.4,133.08 కోట్లు, ప్రారంభ నిల్వ రూ.599.25 కోట్లు కలిపి రూ.4,733.34 కోట్లు వార్షిక రాబడిని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

కేటాయింపులు: డీఆర్డీఏ పద్దు కింద రూ.1973.44 కోట్లు, డ్వామాకు రూ.961.17 కోట్లు, పాఠశాల విద్యకు రూ.293.89 కోట్లు, వ్యవసాయ అనుబంధ శాఖలకు రూ.259.83 కోట్లు, పీఐయూ పనులకు రూ.181.33 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌కు రూ.150.87 కోట్లు వ్యయంగా చూపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ కింద పనులు చేపట్టేందుకు రూ.123.15 కోట్లు కేటాయించారు.

మరో రెండు బడ్జెట్లకూ ఆమోదం

● ఇంకా రూ.15.23 కోట్ల జిల్లా పరిషత్ మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. రాబడుల కింద రూ.82.87 కోట్లు, వ్యయం కింద రూ.67.63 కోట్లు చూపారు. గ్రామ పంచాయతీల్లో టైడ్ గ్రాంట్ రూపేణా వచ్చే నిధులతో పారిశుధ్యం, తాగునీటి పనులను రూ.15.16 కోట్లతో చేపడతామని పేర్కొన్నారు. అతిథిగృహాల నిర్వహణ, నిర్మాణాలకు రూ.4 కోట్లు, కొత్త జడ్పీ ఆఫీసు భవనానికి రూ.4 కోట్లు, కనీస అవసరాలు రూ.8.30కోట్లు మేర ఆర్థిక సంఘం నిధులు వ్యయ పద్ధతిలో పొందుపరిచారు. ప్రకృతి వ్యవసాయానికి రూ.కోటి కేటాయించారు. ● ఇక, 65 మండలాల ప్రజాపరిషత్తు పరిధిలో వివిధశాఖల ఏకీకృత బడ్జెట్‌ను జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఇందులో ఆదాయంగా రూ.4,147.22 కోట్లు, వ్యయంగా రూ.3,222.55 కోట్లు, మిగులుగా రూ.924.67 కోట్లు చూపారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులుతో పాటు వైస్ చైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారమేదీ ?

● జడ్పీ సమావేశంలో తొలిసారి గొంతెత్తిన జడ్పీటీసీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: మండలాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని మండలాల్లో తాగునీరు, జగనన్న లేఅవుట్, నాడు-నేడు పనులు జరగడం లేదని వాపోయారు. జడ్పీ సమావేశంలో తొలిసారిగా వీరు సమస్యలపై గొంతెత్తారు. కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యాక జరిగిన సమావేశాల్లో ఓ సారి ముగ్గురు ఎమ్మెల్యేలు సమస్యలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నేతల్లా ఏమిటంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాడు అసహనం వ్యక్తంచేశారు. దీంతో అప్పట్నుంచి దాదాపుగా సమస్యలను ప్రస్తావించడం మానేశారు. చాలావరకు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఈ సమావేశానికి మంత్రులెవరూ హాజరు కాలేదు. ఇక, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీకాలానికి ఇదే చివరి జడ్పీ సమావేశం. దీంతో చాలామంది ధైర్యంగా సమస్యలు ప్రస్తావించారు. ఎప్పటిలాగే జడ్పీ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. ఆయా వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. చేసిన పనులకు నిధులు విడుదల కాలేదని చంద్రగిరి జడ్పీటీసీ ప్రస్తావించారు. జగనన్న లేఅవుట్లకు సంబంధించి కొన్ని చోట్ల లబ్ధిదారులకు పట్టాలిచ్చినా ఇప్పటివరకు స్థలాలు చూపలేదని, మరికొన్నిచోట్ల స్థలాలు చూపించినా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇలాగైతే ప్రభుత్వంపై లబ్ధిదారులు ఏవిధంగా విశ్వాసం ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆర్‌ఎంపీలు నాసిరకం వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. పాలసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలంలో 11 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. పలుసార్లు అధికారులకు చెప్పినా స్పందించలేదన్నారు. సత్యవేడు సీహెచ్‌సీలో అనస్థీషియాను నియమించాలని, ఆప్తమాలజీకి సంబంధించిన పరికరాలను అందించాలన్నారు. రామచంద్రాపురం మండలంలో 90 రోజుల్లో ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాల్సివున్నా ఇప్పటికీ జాప్యం జరుగుతోందని అక్కడి సభ్యుడు పేర్కొన్నారు. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పంలో గృహనిర్మాణాలు ఇళ్ళపట్టాలు మంజూరుచేయాలని సభలో ప్రస్తావించారు. జలజీవన్ మిషన్ కింద తాగునీటి కనెక్షన్ ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పైప్‌లైన్లు వేసుకున్నామని, ఏడాదైనా ఎలాంటి చర్యలు చేపట్టలేదని బి.కొత్తకోట జడ్పీటీసీ ఆరోపించారు. గట్టు ప్రాంతంలో ఇళ్ళపట్టాలు మంజూరు చేయాలని కోరారు. తొలుత జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జడ్పీ నిధులను పారదర్శకంగా కేటాయిస్తున్నామన్నారు. హంద్రీ నీవా జలాల విడుదలకు సంబంధించి సీఎం జగన్ త్వరలో కుప్పం నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. జేసీ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల డుమ్మా

వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 60 రోజుల్లో జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగే అవకాశం లేదు. దీంతో ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఇదే చివరి సమావేశం. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మినహా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీచరణ్, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎమ్మెల్సీలూ హాజరు కాలేదు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బి.కరుణాకర్‌రెడ్డి ఒక్క సమావేశానికి కూడా రాలేదు. కాగా, ఎంపీగా ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో రెడ్డెప్పను పలువురు సన్మానించారు.

మొక్కుబడి సమావేశం

మంగళవారం నాటి సమావేశం మొక్కుబడిగా మారింది. పలుశాఖలపై చర్చ జరగలేదు. వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్య, జలవనరులు, గృహనిర్మాణం, విద్యుత్తు, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమశాఖ ప్రగతిపై తూతూ మంత్రంగా చర్చించారు. దీంతో ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన ఆయా శాఖల అధికారుల్లో కొందరు సెల్ ఫోన్లకు పరిమితం కాగా, మరికొందరు చల్లగా నిద్రలోకి జారుకున్నారు.


మీటింగులో వైసీపీ కార్యకర్తలు

జడ్పీ సమావేశం ముగిసే వరకు వైసీపీ కండువాలు ధరించిన కార్యకర్తలు లోపల ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల బంధువులు, వాహన డ్రైవర్లూ సమావేశ హాలులో కూర్చొన్నారు. మీడియా ప్రతినిధులను మాత్రం అనుమతించలేదు.

తప్పులు తడకల తుది జాబితా


మృతులకు జాబితాలో చోటు

జీరో డోర్ నెంబరుతో సీఐకి ఓటుహక్కు




తుది జాబితాలో ప్రచురితమైన మృతుల పేర్లు అబ్దుల్‌ఘనీ, వెంకట్రామయ్య

కల్లూరు, జనవరి 23: ఓటర్ల తుది జాబితాలోనూ అవే తప్పులు కనిపిస్తున్నాయి. పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీలోని ఓటర్ల జాబితాను పరిశీలిస్తేనే అనేక తప్పులున్నాయి. 236 పోలింగ్ కేంద్రంలో వెంకట్రామయ్య తండ్రి మునస్వామి 2019లో మృతి చెందినా ఆయనకు తుది ఓటర్ల జాబితాలో ఓటు హక్కుఉంది. బి.నబిసాబ్ పదేళ్ల కిందట, వి.అబ్దుల్ ఘని మూడేళ్ల క్రితం మృతి చెందినా ఓటర్ల జాబితాలో వీరికి స్థానం కల్పించారు. హిందూపురంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు జీరో డోర్ నెంబర్‌తో 237 పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్ల జాబితాలో ఓటు ఉంది. సీఐ కుమారుడు ధీరజ్‌కూ డోర్ నెంబర్ 5-55లో ఓటు హక్కు ఉండటం విశేషం. పాళెం పంచాయతీ కొంగరవారిపల్లెకు చెందిన రేవంత్‌కుమార్, ధనమ్మ, పురుషోత్తంనాయుడు, మునిచేతన్.. కల్లూరు పంచాయతీ న్యూకాలనీ వాసులుగా 239 పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటర్లుగా నమోదయ్యారు. కల్లూరుకు సంబంధించిన జాబితాలో బయటపడిన కొన్ని తప్పులివి.



సీఐ శ్రీనివాస్ పేరు జీరో డోర్ నెంబర్‌తో ఓటర్ల జాబితాలో ఉన్న దృశ్యం



కొంగరవారిపల్లె ఓటర్ల న్యూ కాలనీ ఓటర్లుగా నమోదైన దృశ్యం

ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాల నిరసన



యూనివర్సిటీ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23: ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు మంగళవారం ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. పరిపాలనా భవనం వరకూ ర్యాలీ నిర్వహించాయి. వీసీ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాయి. ప్రైవేట్ డిగ్రీ కాలేజీ అసోసియేషన్ నాయకులు విజయభాస్కరరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, శేషారెడ్డి మాట్లాడుతూ ఏపీసీటీఈ-2024 నోటిఫికేషన్, హ్యాండ్ బుక్ నిబంధనలను పరిశీలిస్తే భవిష్యత్తులో ప్రైవేట్ డిగ్రీ కాలేజీల నిర్వహణ కష్టతరంగా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం కోర్సును నిర్వహించడానికి ఒక్కో కోర్సుకు రూ.5 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కోర్సుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లీజుబిల్డింగ్‌లో ఉన్న కాలేజీలు ఒక్క కోర్సుకు రూ.5 లక్షలు కచ్చితంగా చెల్లించాల్సి ఉందన్నారు. ఏ ఇంజినీరింగ్ కాలేజీ అయినా ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం, బీసీఏ కోర్సులు కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారని అన్నారు. దీనిపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని అన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 31న విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలకు చెందిన డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీడీసీఎంఎస్ పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారంతో పాలకవర్గ పదవీకాలం ముగియగా సోమవారం నుంచి మరో ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే వరకు పాలకవర్గం పదవీ కాలం పొడిగిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పొల్గొన్నారు. ప్రస్తుతం సొసైటీ చైర్‌పర్సన్‌గా నాగలక్ష్మి ఉన్న కమిటీలో మొత్తం ఏడుగురు సభ్యులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 23: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మంగళవారం చిత్తూరులోని 6, 7 డివిజన్లలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని దొరబాబు పేర్కొన్నారు. సీఎం జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు నమోదు చేయించడం, దాడులు చేయించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు మాజీ ఎమ్మెల్సీ చంద్రప్రకాష్, సీఆర్ రాజన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, గురజాల జగన్‌మోహన్, డీకే బద్రి నారాయణ, కోదండయాదవ్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, సీఎం విజయ, దుర్గా చౌదరి, రాజశేఖర్, శశికర్ బాబు, సుబ్రమణ్యం నాయుడు, ఈశ్వర్,ఆనంద్, శేషాద్రి, రాజేష్, కంద, రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు


టీవీ సుబ్రమణ్యం

చిత్తూరు (సెంట్రల్), జనవరి 23: జేఈఈ మెయిన్స్ సెషన్ 1 పరీక్షలు బుధవారం నుంచి ఫిబ్రవరి ఒకటో తేది వరకు జరుగుతాయని సిటీ కోఆర్డినేటర్ టీవీ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. చిత్తూరులో 1306 మంది పరీక్షలు రాసేలా సీటెమ్స్‌ను కేంద్రంగా ఎంపిక చేశామన్నారు. ఈ సెంటర్‌లోనే అన్ని రోజులు ఉదయం 9 గంటల నుంచి.. మధ్యాహ్నం 3 గంటల నుంచి రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. తొలిరోజైన బుధవారం మధ్యాహ్నం సెషన్ నుంచి పరీక్షలు మొదలవుతాయన్నారు. నిర్ణీత సమయం దాటాక ఒక్క నిమిషమైనా ప్రవేశానికి అనుమతించబోమని స్పష్టంచేశారు. అడ్మిట్ కార్డుతో పాటు ఆధార్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకు రావాలన్నారు. ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతివాచీ తదితరాలకు అనుమతి లేదన్నారు.

చిత్తూరులో జూదం డబ్బు లూటీ!

చిత్తూరు, జనవరి 23: చిత్తూరు నగరంలో జూదం ఆడుతున్న ఓ ముఠా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.20 లక్షలు లూటీ చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి రెండు గ్రూపులు నగర శివార్లలోని చిత్తూరు-బెంగళూరు జాతీయ రహదారి పక్కన జూదం ఆడుతున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో జూదం ఆడి గెలుచుకున్న ఓ ముఠా నుంచి మరో ముఠా రూ.20 లక్షలు లూటీ చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బాధితులు వెనుకడుగు వేసినట్లు సమాచారం. జూదం నుంచి ఇంత మొత్తం సంపాదించడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇబ్బంది వస్తుందని మిన్నకుండిపోయినట్లు తెలిసింది. అయినా, ఈ విషయం అటు ఇటు చేరి పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు ఆరా తీస్తున్నారు.

ఇద్దరు గజదొంగల అరెస్ట్

రూ.46.93 లక్షల బంగారు, వెండి, వస్తువుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23 : ఒంటరిగా ఉంటున్న, వయసు పైబడిన మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగులకు, తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ లక్షల రూపాయల విలువజేసే బంగారు, వెండి నగలు, వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు గజదొంగలను తిరుచానూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46.93 లక్షల విలువజేసే బంగారు, వెండి, వాహనాలు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ పరమేశ్వరరెడ్డి మీడియాతో వివరాలు వెల్లడించారు. తిరుపతి మధురానగర్‌కు చెందిన పాపాని క్రాంతికుమార్ అలియాస్ క్రాంతి (26), కేటీ రోడ్డుకు చెందిన యమలం జ్ఞానేశ్‌కుమార్ అలియాస్ చంటి (25) చిన్ననాటి నుంచే చెడు అలవాట్లకులోనై డబ్బు కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. మూడు సంవత్సరాలుగా తిరుపతి, పరిసర ప్రాంతాల్లో అనేక దొంగతనాలు చేశారు. పిల్లలకు ట్యూషన్ చెబుతామని, బజాజ్ ఫైనాన్స్ నుంచి అడ్రస్ వెరిఫికేషన్‌కు వచ్చామని రకరకాల కారణాలు చెప్తూ ఇళ్లలోకి ప్రవేశించి అదను చూసి చైన్ స్నాచింగులు, చోరీలు చేయసాగారు. ఫిర్యాదులు రావడంతో క్రైం ఏఎస్పీ విమలకుమారి నేతృత్వంలో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఈ ఇద్దరు నిందితులుగా గుర్తించి, కదలికలపై నిఘాపెట్టింది. తిరుపతి-రేణిగుంట మార్గంలోని వార్త క్రాస్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకుంది. వారిని విచారించి 803 గ్రాముల బంగారు, 900 గ్రాముల వెండి ఆభరణాలు, ఓ రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.46,93,500 ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. నిందితులిద్దరూ విశాఖపట్నంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్టు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. నిందితులిద్దరిపై జిల్లా వ్యాప్తంగా 14 కేసులు ఉన్నాయని చెప్పారు. దొంగలను పట్టుకోవడమేగాక పెద్దమొత్తంలో నగలు, సొమ్మును రికవరీ చేసిన సీఐ శివప్రసాద్‌రెడ్డి, ఎస్ జగన్నాథరెడ్డి, ఏఎస్ఐ రాఘవయ్య, కానిస్టేబుళ్లు జాకీర్ హుస్సేన్, ప్రభాకర్, ప్రసాద్, లక్ష్మీప్రసాద్, మణిరత్నం, నాగార్జున, టెక్నికల్ విభాగం చందులను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.



రామకుప్పంలో టీడీపీ శ్రేణుల ర్యాలీ - జయహో బీసీ సభలో మాట్లాడుతున్న కంచర్ల శ్రీకాంత్

బీసీలంతా ఏకమై వైసీపీని తరిమికొడదాం / జయహో బీసీ సభలో టీడీపీ నేతల పిలుపు

రామకుప్పం, జనవరి 23: 'వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలను తీరని ద్రోహం చేసింది. బీసీలంతా ఏకమై వైసీపీ నయవంచక పాలనకు చరమగీతం పాడాలి' అని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం పిలుపునిచ్చారు. రామకుప్పం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సభలో వారు మాట్లాడారు. రాజకీయ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి ఈ ప్రభుత్వం తగ్గించడంతో 16800మంది బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. బీసీ నేతలు, కార్యకర్తలతో పాటు సాధారణ జనంపైనా దౌర్జన్యాలు పెరిగాయన్నారు. అక్రమ కేసులు బనాయించి. జైళ్ళపాలు చేశారన్నారు. బీసీలకు పదవులు తప్ప, అధికారం, ఆజమాయిషీ మొత్తం అగ్రవర్ణనేతలే చేలాయిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో బీసీ అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వారు గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగా అవకాశాలు కల్పించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులు, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు, ఆదరణ పరికరాలు, కళ్యాణమస్తు వంటి కార్యక్రమాలను రద్దు చేసిందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, బీసీసెల్ జిల్లా కార్యదర్శి మనోహర్, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి వెంకటరమణ, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వేలు, సురేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జినరేష్, మండలఅధ్యక్షుడు హరీష్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు బందార్లపల్లె క్రాస్ నుంచి వేలాదిమంది బీసీలతో పోలీస్‌స్టేషన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ళు, పార్టీ శ్రేణుల నినాదాల మధ్య ఈ ర్యాలీ సాగింది. తమిళనాడు నుంచి వచ్చిన డప్పు కళాకారులు, కీలుగుర్రాల కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల్లో ర్యాలీ ఆకర్షణగా నిలిచాయి.




సోమవారం ఉదయం బీజేపీ నేతలు ఎగుర వేసిన పార్టీ పతాకం - సోమవారం సాయంత్రం అధికారులు ఎగురవేసిన జాతీయ పతాకం - మంగళవారం నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

నగరిలో 'పతాక' వివాదం

నగరి, జనవరి 23: నగరిలోని ఓంశక్తి దేవాలయం ఎదురుగా తమ పార్టీ జెండాను ఎలా తొలగిస్తారంటూ మంగళవారం బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 అడుగుల బీజేపీ జెండాను ఎగురవేశారు. అక్కడే శ్రీరాముడి పటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కాగా, సాయంత్రానికి బీజేపీ జెండాను తొలగించి.. ఆ స్తంభానికి అధికారులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అందించకనే పార్టీ పతాకాన్ని తొలగించి అవమానపరిచారంటూ మున్సిపల్ కార్యాలయం బీజేపీ నేతలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా అధికారులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అధికార పార్టీకి తొత్తుగా కమిషనరు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కమిషనరు రాకపోవడంతో పట్టణాభివృద్ధి అధికారిణికి నిరసన తెలిపారు. కాగా, పది అడుగులకు మించి పతాకాన్ని ఎగురవేయరాదని, జెండా ఆవిష్కరణకు మున్సిపల్‌శాఖ అనుమతి పొందలేదని, అందుకే బీజేపీ పతాకాన్ని తీసేసి జాతీయపతాకాన్ని ఎగుర వేయించినట్లు అధికారులు చెప్పారు. కాగా, కమిషనరును సస్పెండ్‌చేసేవరకు పోరాటం ఆపేది లేదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. నేతలు ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, రామ్మూర్తియాదవ్, రమేష్‌నాయుడు, యువరాజు, మునికృష్ణమనాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై 29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు రూరల్, జనవరి 23: విద్యుత్ ఛార్జీల పెంపుపై ఈ 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. చిత్తూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించిన ఈఈ కార్యాలయాల్లో రైతులు, ప్రజలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్సీ అధికారులు మాట్లాడి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంట వరకు అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

టక్కరి పోలీస్

- కానిస్టేబుల్ అవతారమెత్తిన సెక్యూరిటీ గార్డు
- యూనిఫాం, ప్రభుత్వ వాహనంతో హల్‌చల్


పోలీస్ యూనిఫాంలో అజయ్

శ్రీకాళహస్తి, జనవరి 23: ఒక ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు సినీఫక్కీలో కానిస్టేబుల్ అవతారమెత్తాడు. అధికారులతో స్నేహం చేస్తూ దర్జాగా ప్రభుత్వ జీపులోనే మూడేళ్ల పాటు హల్‌చల్ చేశాడు.కానిస్టేబుల్ యూనిఫామ్ ధరిస్తూ ప్రజలందరినీ నమ్మించాడు. వసూళ్లపర్వంలో అతడి అత్యుత్సాహం అసలు పోలీస్ సిబ్బందిలో అసహనం పెంచింది. దీంతో ఈ టక్కరి పోలీస్ తతంగాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఇన్నాళ్లూ అతడిని నిజమైన పోలీసుగా భావించిన జనం కంగుతిన్నారు. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన అజయ్ ముక్కంటి ఆలయంలో నాలుగేళ్ల క్రితం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా చేరాడు. భక్తులతో దురుసు ప్రవర్తన కారణంగా రెండు నెలలకే అక్కడినుంచి సాగనంపారు. తిరుమలలో అతడి మామ నాలుగేళ్ల క్రితం సెక్యూరిటీ టెండరు దక్కించుకోవడంతో అజయ్ కొంతకాలం అక్కడ పనిచేశాడు. పోలీసుశాఖ ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని తీసుకునేది.మూడేళ్ల క్రితం మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 12మంది ట్రాఫిక్ నియంత్రణ కోసం శ్రీకాళహస్తికి వచ్చారు.వారిలో వున్న అజయ్ కుమార్ శ్రీకాళహస్తిలోని కొందరు పోలీసు అధికారులతో స్నేహం ఏర్పరచుకున్నారు. కొద్దిరోజుల తర్వాత అజయ్ మామకు సెక్యూరిటీ కాంట్రాక్టు ముగిసింది.దీంతో అజయ్ శ్రీకాళహస్తిలో ఓ అధికారి పంచన చేరాడు. అజయ్‌ని ఆయన తన ప్రైవేటు డ్రైవర్‌గా అధికారి అందరికీ పరిచయం చేశాడు.కొద్ది నెలలపాటు ఆయన వెంటే జీపు నడుపుతూ గడిపేవాడు.వాహనాల తనిఖీలు కూడా చేసేవాడు. అధికారితో స్నేహంగా ఉండడంతో కానిస్టేబుళ్లు ప్రశ్నించేవారు కాదు. మెల్లగా అజయ్‌కు ధీమా ఏర్పడింది. ఇక ఎవ్వరూ అడగరు అన్న ధైర్యంతో యూనిఫామ్ ధరించాడు. హోంగార్డులు సైతం పోలీసు లోగోను ధరించడం నేరం.జంగిల్ షూస్ అనేది కేవలం గ్రేహౌండ్స్ శిక్షణ పొందిన సిబ్బంది మాత్రమే ఉపయోగించాలి. ప్రస్తుతం అలాంటివారు జిల్లాలో41మంది మాత్రమే ఉన్నారు.అయితే అజయ్ అందరికీ భిన్నంగా ఖరీదైన యూనిఫామ్ వేసేవాడు. సినిమా హీరోలా నల్ల కళ్లజోడు ధరించేవాడు. డ్రైవరుగా అవకాశమిచ్చిన అధికారి ఏడాదిన్నరక్రితం బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఓ ఏఎస్ఐతో జత కట్టిన అజయ్ పోలీస్‌గా చలామణి అయ్యాడు. ఈసమయంలో మరో అధికారితో పరిచయం బలపడి ఆయన చెంత తిష్ట వేశాడు. ప్రభుత్వ జీపు దొరకడంతో సరదాగా టీ తాగే దగ్గర నుంచి ఇంటి సరుకులు తీసుకెళ్లే వరకూ పోలీస్ వాహనంలోనే తిరిగేవాడు. సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసపు దుకాణాల్లో దర్జాగా వసూళ్లకు పాల్పడేవాడు. అధికారి వాహనంలో వస్తుండడంతో హోటళ్ల నిర్వాహకులు అడిగినప్పుడంతా ఆహారపు పార్శిళ్లు అందజేసేవారు. స్టేషన్లో సిబ్బందికి తరచూ టిఫిన్లు, భోజనాలు ఉచితంగా తీసుకొస్తుండడంతో ఎవరూ ఈ అనధికారిక పోలీసును ప్రశ్నించలేదు. ఏడాదిన్నర కాలం అధికార దర్పం ప్రదర్శించిన అజయ్ స్టేషన్లో కొందరిని ధిక్కరించే స్థాయికి చేరుకోవడంతో ఇతగాడి నిజస్వరూపాన్ని ఎవరో సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. చూసిన జనమంతా కంగుతిన్నారు. ఉన్నతాధికారులు విచారిస్తే ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందో అన్న ఆందోళన కొందరు అధికారుల్లో కన్పిస్తోంది.

మీ ఇష్టారాజ్యం కుదరదు!

- కార్యకర్తల ఇండ్లకున్న టీడీపీ పోస్టర్లు తొలగించడంపై శ్రేణుల నిరసన



మంగళం సచివాలయం వద్ద టీడీపీ శ్రేణులతో కలసి బైఠాయించిన సుధారెడ్డి (ఇన్‌సెట్లో) నానీ వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి (రవాణా), జనవరి 23 : చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళంలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది.టీడీపీ కార్యకర్తలు తమ ఇళ్లకు వేసుకున్న పార్టీ వాల్‌పోస్టర్లను మంగళవారం పంచాయతీ సిబ్బంది తొలగించడంపై టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి.చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానీ సతీమణి సుధారెడ్డి ఎస్‌సీబీఎన్ కాలనీకి చేరుకుని వాల్‌పోస్టర్లను ఎందుకు తొలగిస్తున్నారంటూ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు.హోర్డింగులు, బ్యానర్లు కట్టరాదంటూ జీవో ఉందని వాల్‌పోస్టర్లు అతికించాలంటే ముందస్తు అనుమతి తీసుకుని పన్ను చెల్లించాలని కార్యదర్శి సమాధానం ఇచ్చాడు. అయితే తామేం హోర్డింగ్‌లు, బ్యానర్లు కట్టలేదని తమ పార్టీ కార్యకర్తల ఇళ్లకు నానీ వాల్‌పోస్టరు అతికించుకుంటే తొలగించే హక్కు ఎవరు ఇచ్చారంటూ సుధారెడ్డి ప్రశ్నించారు. మంగళం సచివాలయంలో వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఫొటో ఎవరి అనుమతితో పెట్టారని నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి సొంత రాజ్యాంగం నడుస్తోందంటూ విమర్శించారు. సొంత ఖర్చుతో తాము వాల్‌పోస్టర్లు వేసుకోకూడదని రాతపూర్వకంగా తమకు ఇచ్చే వరకు వెళ్లబోమంటూ సచివాలయం ముందు పార్టీ కార్యకర్తలతో కలిసి సుధారెడ్డి బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దాదాపు రెండు గంటల తరువాత పంచాయతీ కార్యదర్శి రాజేష్ రాతపూర్వకంగా పత్రాన్ని సుధారెడ్డికి ఇచ్చారు. నిజానికి పంచాయతీ పరిధిలో వైసీపీ వాల్‌పోస్టర్లు కూడా ఉన్నాయి. వాటికి లేని ముందస్తు అనుమతి టీడీపీ పోస్టర్లకు మాత్రం ఎందుకు తీసుకోవాలని టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి.

జర్నలిస్టును అడ్డుకున్న వైసీపీ నాయకులు

ఈ సంఘటనను కవర్ చేయడానికి వెళ్లిన ఏబీఎన్ ఛానల్ ప్రతినిధిని వైసీపీ నేతలు అడ్డుకున్నారు. వాల్‌పోస్టర్లను తొలగించిన తీరుపై పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను, ఈవో పీఆర్డీ గిరిధర్‌ను ప్రశ్నలు అడుగుతున్న సమయంలో వైసీపీ నాయకులు పెద్దగా కేకలు పెట్టడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.సర్దిచెప్పాల్సిన పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శల పాలైంది.

ఏమయ్యా.. అభ్యర్థిగా నేను వద్దా?

కార్వేటినగరం వైసీపీ నేతతో ఎంపీ రెడ్డెప్ప చమత్కారం

చిత్తూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'ఏమయ్యా నేను అభ్యర్థిగా వద్దా మీకు. ధర్నాలు బలంగా చేస్తున్నావు' అని కార్వేటినగరం ఎంపీపీ లత భర్త బాలాజీ నాయుడితో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చమత్కరించారు. మంగళవారం చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశం సందర్భంగా వారిద్దరూ తారసపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీ నవ్వుతూ బాలాజీతో మాట్లాడారు. జడ్పీ సమావేశం అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. జీడీనెల్లూరులో మీ అభ్యర్థిత్వాన్ని స్థానిక వైసీపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ అంశంపై నేను మాట్లాడను. నిజానిజాలు మీకే తెలుసు. విశ్లేషించలేను. వ్యతిరేకించి మాట్లాడలేను. నారాయణస్వామి నాకు మిత్రుడు. మా ఇద్దరి మధ్య ఏ పొరపొచ్చాలు లేవు' అని చెప్పుకొచ్చారు. 'పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటాను. మేం కొన్ని అనుకోవడం, అవి నెరవేరకుంటే బాధ పడటం అంటూ ఏం ఉండదు. సీఎం జగన్ స్థాపించిన పార్టీలో మేమంతా ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఉన్నాం. వచ్చే ఎన్నికల్లో సీఎం ఏది ఆదేశిస్తే దాన్ని నేను శిరసావహిస్తాను' అని పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.324.35 కోట్ల చెక్కు



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: కలెక్టరేట్‌లో మంగళవారం వైఎస్సార్ ఆసరా కింద రూ.324.35 కోట్ల చెక్కును ముఖ్య అతిథుల చేతులమీదుగా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయ రెడ్డి, చిత్తూరు మేయర్ అముద, ఎల్డీఎం హరీష్, డీఆర్డీఏ పీడీ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలున్న వారికి రిజిస్ట్రేషన్లు చేయాలి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా పట్టాలు పొందిన వారి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభించి ఫిబ్రవరి 9వ తేదీతో పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. వీఆర్వో లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. దీనిపై బుధవారం సబ్ రిజిస్ట్రార్ల ద్వారా వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు, 25న డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వాలన్నారు.

స్విమ్స్‌లో 26న ఓపీ, ఓటీ సేవలకు సెలవు

తిరుపతి సిటీ, జనవరి 23 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

క్లస్టర్ బాధ్యతను బలిజలకు ఇవ్వాలి


ఎమ్మెల్సీ కంచర్లకు లేఖ అందిస్తున్న టీడీపీ బలిజ నాయకులు

కుప్పం, జనవరి 23: కుప్పం పురపాలక సంఘంలో టీడీపీ తరఫున 11వ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా త్రిలోక్‌ను కొనసాగించాలని, అదే సమయంలో ఆయన ఆరోగ్యం దృష్ట్యా ఆలోగా తాత్కాలిక బాధ్యతలను బలిజ కులస్థులకే ఇవ్వాలని ఆ సామాజిక వర్గానికి చెందిన పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కోరాయి. కుప్పంలోని స్వగృహంలో మంగళవారం బలిజ కులానికి చెందిన పార్టీ నాయకులు, కార్య కర్తలు పలువురు ఎమ్మెల్సీ కంచర్లను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 11వ క్లస్టర్ ఒక్కదానినే బలిజ కులస్థులకు కేటాయించారని గుర్తుచేశారు. ఇన్‌ఛార్జిగా ఉన్న త్రిలోక్ రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆయననే ఇన్‌ఛార్జిగా కొనసాగించాలని, ఆలోగా తమలో ఒక బలిజ కులస్థుడికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబుకు రాసిన లేఖను ఎమ్మెల్సీకి అందించారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, ఆర్.ఆర్.రవి, సోము పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, జనవరి23 : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నా క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిబాబు, నాగరాజు, ఆర్బీసీ కుట్టి, ఖాజా, సుబ్రమణ్యంగౌడు, పర్వీన్, ప్రమీల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆప్టా క్యాలెండర్ల ఆవిష్కరణ



పలమనేరు, జనవరి 23 : పలమనేరు ఎమ్మార్సీ వద్ద మంగళవారం ఆప్టా ఉపాధ్యాయ సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి మునాఫ్, కార్యదర్శి అన్సార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

రొంపిచెర్ల, జనవరి 23: రొంపిచెర్ల మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై అధికారులతో మంగళవారం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, మంత్రి పీఏ తుకారాం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, సిమెంట్ రోడ్లు, తాగునీటి అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వాలని పీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, వైస్‌ఎంపీపీ విజయశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ డీఈ రాజేంద్ర, మురళి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుంగనూరులో టీడీపీ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, జనవరి23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, దేశాధిప్రకాశ్, మురారి దినేశ్, సుహేల్‌బాషా. రామయ్య, ప్రసాద్, సద్దాంహుస్సేన్, నౌషాద్, కేశవమూర్తి, రాజు, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌శెట్టి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఎల్లంకివారిపల్లెలో నారా లోకేశ్ పుట్టినరోజు



కల్లూరు, జనవరి 23: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె పంచాయతీ కేంద్రంలో మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా చేసి మాట్లాడాలి


విలేకరులతో మాట్లాడుతున్న సుహేల్‌బాషా

పుంగనూరు, జనవరి23: రాజకీయాలు మాట్లాడాలంటే మతపెద్దలుగా పదవులకు రాజనామాలు చేసి మాట్లాడాలని టీడీపీ మైనార్టీ యువనాయకుడు సుహేల్‌బాషా సూచించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంజుమన్‌కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం పదవిలో ఉంటూ రాజకీయ నాయకుడిగా వ్యవహరించడం తగదన్నారు. గతంలో టీడీపీలో పదవులు అనుభవించి ప్రస్తుతం ఆ పార్టీని విమర్శించడం సరికాదన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీలకు చేసిన అభివృద్ధిపై చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. వైసీపీ పాలనలో పట్టణంలో మైనార్టీలు కేసులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాదీమహాల్ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు చెప్పినా ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. నాయకులు అబ్బాస్, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.

కులగణన సర్వే తనిఖీ

సోమల: మండలంలో కుల గణన సర్వేని మంగళవారం సోమలలో ఎంపీడీవో నాగరాజ తనిఖీ చేశారు. వలంటీర్ల వెంట సచివాలయ ఉద్యోగులు, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శి సుధాకర్‌కుమార్, ప్రసన్న, జయశంకర్ ఉన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

కల్లూరు, జనవరి 23: పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం వగళ్లవారిపల్లికి చెందిన ఎంవీ రమణారెడ్డికి రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్య క్షులు నాథమునిరెడ్డి, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, కార్యాలయం ఏవో సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడువుకు ముందే లక్ష్యం సాధించిన మార్కెట్ కమిటీ

పలమనేరు, జనవరి23 : పలమనేరు మార్కెట్ కమిటీకి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని గడువుకు ముందే సాధించింది. మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ.2.75 కోట్లు కాగా జనవరి 15నాటికే రూ. 2.80 కోట్లు సాధించింది. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల మార్కెట్ కమిటీ కార్యదర్శుల సమావేశంలో కడప ఆర్‌జేడీఎం రామాంజనేయులు పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.సంజీవ కుమార్‌ను అభినందించడంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఏడీఎం ఎం.పరమేశ్వరన్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అప్పినపల్లె విద్యార్థి


విద్యార్థి లిఖిత్

పెద్దపంజాణి, జనవరి 23: కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఎంట్రన్స్ పరీక్షలో అప్పినపల్లె విద్యార్థి లిఖిత్ తన ప్రతిభ చూపాడని ప్రధానోపాధ్యాయుడు నంద కుమార్ పేర్కొన్నారు. ఈ స్కాలర్‌కు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు అందిస్తారని పేర్కొన్నారు. లిఖిత్‌ను టీచర్లు వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మి, ఆనందన్, గోపి అభినందించారు.

ఓటు వజ్రాయుధం

పెద్దపంజాణి, జనవరి 23: ప్రజాస్వామ్యంలో ఓటు సామాన్యుడి వజ్రాయుధం అని ఉపాధ్యాయులు వివరించారు. మండలంలోని అన్ని పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థుల ద్వారానే పోలింగ్ నిర్వహణ, అభ్యర్థుల నియామకం తదితర అంశాలు విశదీకరించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను, రాజ్యాంగాన్ని కాపాడే వ్యక్తులను ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు

పలమనేరు, జనవరి23 : పలమనేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈ నెల 24 నుంచి 29 వరకు నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మనోజ్‌కుమార్ తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట, పెద్దపంజాణి మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



పుంగనూరు రూరల్, జనవరి23: జాతీయ ఉపకారవేతనానికి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు కొత్తయిండ్లు ప్రభుత్వ పాఠశాల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపికైన వారిలో అనీషారెడ్డి, సల్మాన్‌బాషా, మనోజ్, పురుషోత్తం, శశాక్‌సాయి, ప్రీతి, నిత్యాహాసన్, సారిక ఉన్నారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో ఓం శక్తి భక్తుల ఇరుముడి

కల్లూరు, జనవరి 23: పులిచెర్ల మండలం కల్లూరు దాసరిగూడెంలోని ఓంశక్తి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి ఓం శక్తి భక్తుల ఇరుముడి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఇరుముడి పూజల అనంతరం భక్తులు మేల్‌మరువత్తూరుకి బయలుదేరారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం



చౌడేపల్లె, జనవరి 23: మండలంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజును మండల మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గని ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దాదేపల్లెలో మైనార్టీ నాయకులు కేక్‌కట్ చేసి, కార్యకర్తలకు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. మైనార్టీ నాయకులు హమీద్‌ఖాన్, సషిద్‌ఖాన్, షాహిన్‌షా పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

జయహో బీసీ సభలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి


పట్టణంలో ర్యాలీగా వెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

వి.కోట, జనవరి 3: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే బీసీలకు సముచిత స్థానం సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం వి.కోటలో టీడీపీ నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు హాజరయ్యాయి. పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వద్దకు మండల పరిధిలోని అన్నిగ్రామాల నుంచి ద్విచక్ర వాహనాలపై వచ్చిన టీడీపీ బీసీ శ్రేణులకు నేతలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పసుపు జెండాలు చేత పట్టి పట్టణ పురవీధుల్లో బాణసంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో ర్యాలీ కొనసాగించారు. అనంతరం జీఎంఎస్ కళ్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ బాబు హయాంలో ఆదరణ కింద చేతి వృత్తుల వారికి పనిముట్లు ఇచ్చి ఆదుకుంటే ఈ ప్రభుత్వం చేతి వృత్తులను నిర్వీర్యం చేసిందన్నారు. మార్పుల పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానాలను మార్చి వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆరోపించారు. బీసీలకు టీడీపీ అనేక కార్పొరేషన్ల ద్వారా నిధులు ఇచ్చి ఆదుకుంటే, ఈ సర్కారు కేవలం పదవులు కట్టబెట్టి నిధులు ఇవ్వకుండా నిలువునా ముంచేసిందన్నారు. అనంతరం సీనియర్ బీసీ నేతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధికార ప్రతినిధి చౌడప్ప, మండల బీసీ సెల్ అధ్యక్షులు డి.ఎస్.కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు సోము, చిట్టిబాబు, విశ్వనాథ్, శివకుమార్, నాగరాజ్, మురుగేష్, సురేంద్ర, గంట్లప్పగౌడు, శివకుమారి, శ్రీనివాసులు, భక్తా, గుణ, సతీష్, రాంబాబు, రుహుల్లా పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అన్నదానం, రక్తదానం


రక్తదానం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జనవరి 23: కుప్పంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీ య ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడు కలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపించి, పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాల యం ఎదురుగా బైపాస్ కూడలిలో ఏర్పాటు చేసిన లోకేశ్ భారీ కటౌట్‌కు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కుప్పం పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కూడలి దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఇక్కడే భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం నిర్వ హించారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించి కార్యకర్తలు, నాయకులు కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మణి, మంజునాథ్, ఆర్ముగం, సోము, ఆర్ఆర్.రవిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమిదే అధికారం: గౌనివారి


కేక్ కట్ చేస్తున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, జనవరి 23: నారా లోకేశ్ జన్మదిన వేడుకలను రామకుప్పంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక బందార్లపల్లె క్రాస్‌లో ఏర్పాటు చేసిన లోకేశ్ భారీ ఫ్లెక్సీ ఎదుట మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేసి, నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, బీసీసెల్ జిల్లా కార్యదర్శి మనోహర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేలు, సురేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేష్, మండల అధ్యక్షుడు హరీష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిటాల వర్ధంతికి తరలిన పులిచెర్ల నేతలు

కల్లూరు, జనవరి 23: అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం వెంకటాపురంలో బుధవారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతికి పులిచెర్ల మండలం నుంచి మంగళవారం టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెళ్లిన వారిలో గోపీనాయుడు, గిరిబాబు నాయుడు, పురుషోత్తం నాయుడు, ధనంజయ నాయుడు, మునిరత్నం నాయుడు, సందీప్‌నాయుడు, బాలకృష్ణమనాయుడు, జయచంద్రనాయుడు, శేఖర్, మనోహర్‌శెట్టి, వీరాస్వామి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

గుడుపల్లె, జనవరి 23: కూలి పనుల కోసం వ్యవసాయ పొలంలోకి వెళ్లిన మహిళ విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. గుండ్లసాగరం గ్రామానికి చెందిన మాబుబ్ భార్య కుమురున్(58) అదే గ్రామంలో మంగళవారం ఉదయం కూలి పనుల కోసం వెళ్లింది. పొలంలో ఆమె పనులు చేస్తుండగా విద్యుత్ పోల్ పక్కన ఉన్న స్టేవైరు షాక్ తగిలింది, స్థానికులు ఆమెను కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిరాలి కుటుంబాన్ని ఎమ్మెల్సీ భరత్ పరామర్శించారు.

కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య



చౌడేపల్లె, జనవరి 23: కడుపు నొప్పితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. ఏఎస్ఐ వాసు కథనం మేరకు.. మండలంలోని చారాల పంచాయతీ చారాల కురప్పల్లెకు చెందిన గిరి భార్య లీలావతి (46) వ్యవసాయ కూలీలు. కొంత కాలంగా లీలావతి కడుపునొప్పితో బాధ పడుతుండేది. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక మంగళవారం పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు 108 లో మదనపల్లె పభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి23: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర కథనం మేరకు.. పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన నందినికి పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన నాగరాజుతో వివాహమైంది. కొంతకాలంగా డబ్బు తీసుకురావాలని భర్త నాగరాజు, అత్త రత్నమ్మ కలిసి నందినిని వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారా లోకేశ్ పేరిట పూజలు


రొంపిచెర్లలో కేక్ కట్ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు రొంపిచెర్లలో పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా, తెలుగుయువత ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, ఐ-టీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు గూడురు హరిబాబు, నియోజక వర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, బాబులాల్, గౌస్‌పీర్, రామమూర్తి, సయ్యద్ బాష, నాగిశెట్టి నాగరాజు, సిద్ధయ్య తదిదరులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలో నారా లోకేశ్ జన్మదినాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వినాయకుడి ఆలయంలో లోకేశ్ పేరిట ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. టీడీపీ మండల అధ్యక్షులు బాబు నాయుడు, మునిరాజు, చంద్రశేఖర్, హేమాంబర్ గౌడు, బేటప్పనాయుడు, ఎస్ఆర్ చంద్ర, వెంకటేశ్, భానుమూర్తి, లక్ష్మీపతి, రమేష్, రాము, మంజునాథ్, సుబ్బు, వాసు, గోవిందు, ఎల్లప్ప పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

చౌడేపల్లె, జనవరి23: మండలంలోని పరికిదొనలో వాటర్‌షెడ్ అనిమల్ హెల్త్ క్యాంప్ ద్వారా మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పశువైద్యాధికారి పవన్‌కుమార్ 150 పశువులకు ఉచితంగా చికిత్సలు అందించారు. మందులు పంపిణీ చేశారు. వాటర్ షెడ్ చైర్మన్ చలపతి, సభ్యు రాలు స్వాతి, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి



పుంగనూరు రూరల్, జనవరి23: పట్టణ, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో కనుమ పండుగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని తూర్పుమొగసాల, తాటిమాకులపాళ్యం, నాగపాళ్యం, మండలంలోని కుమ్మరగుంట, ఓబిరెడ్డిపల్లె, బసివినాయునిపల్లె తదితర గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఉదయాన్నే ఇళ్ల ముందర రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ప్రతి ఇంటా పశువులను నీటితో శుభ్రం చేసి గంటలు, గజ్జలు, బెలూన్‌లు కట్టి అలంకరించారు. తర్వాత మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. పశువులకు నడివీధి గంగమ్మ వద్ద, కాటమరాజు ఆలయాల వద్ద పూజలు చేశారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టి పశువులను ఆ కుప్ప చుట్టూ తిప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం


పలమనేరులో ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థినులు


చౌడేపల్లెలో ఓటు వేస్తున్న విద్యార్థినులు

కల్లూరు, జనవరి 23: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజు, ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు, కావేటిగారిపల్లె, ఎల్లంకివారిపల్లె, పులిచెర్ల, మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పలమనేరు: పలమనేరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అధికారులు, పోలింగ్ ప్రక్రియ, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ మాక్ పోలింగ్‌ను పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ కుప్పస్వామి, ఎంఈవో లీలారాణి, ఎంపీడీవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

గుడుపల్లె: గుడుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో తాజ్ మాస్రూర్, ఎంఈవో లక్ష్మయ్య పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌ను పరిశీలించారు.

చౌడేపల్లె: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం, పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఎంఈవో కేశవరెడ్డి పర్యవేక్షించారు.

రొంపిచెర్ల: మండలంలోని పాఠశాలల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ అమరనాథ్ పరిశీలించారు.

సోమల: మండలంలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, హెచ్ఎంలు కుసుమాంబ, నాగరాజ, నిరంజన్‌కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: స్థానిక జడ్పీ బాలికోన్నత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు, వీవీప్యాట్ నమూనాలను ఉపయోగించి మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ సీతారామ్ పరిశీలించారు.

వి.కోట: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలింగ్ అవగాహన కల్పించారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి


పలమనేరులో నివాళులు అర్పిస్తున్న తాతయ్యనాయుడు, తదితరులు

పుంగనూరు రూరల్, జనవరి23: స్వాతంత్ర్య సమర యోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పుంగనూరులో బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘననివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, పూల ప్రేమకుమార్, పెద్దమఠం బాబు, మహేశ్వర్, మనీమొదలియార్, జగన్నాథం, శ్రీరాములురెడ్డి, పురుషోత్తం, నాగరాజ, బద్రి, నిరంజన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేసి నివాళులు అర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు తాతాయ్యనాయుడు, పలువురు బీజేపీ కార్య కర్తలు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రమాదేవి పాల్గొన్నారు.

● పట్టణంలో సామాజిక కార్యకర్త మధుమోహన్ రావు, యోగాగురువు నందగోపాల్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు.

కుప్పం: కుప్పం పురపాలక సంఘంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు మున్సిపల్ రాజావారి పార్క్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీ పాలనలో బలహీన వర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న సహదేవ

రొంపిచెర్ల, జనవరి 23: దళిత, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆ పార్టీ పుంగ నూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహ దేవ, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా పేర్కొన్నారు. మంగళవారం రొంపిచెర్ల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సహదేవ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు నిలిపేశారని విమర్శించారు. కరీముల్లా మాట్లాడుతూ మైనార్టీల కోసం టీడీపీ ప్రవేశపెట్టిన రంజాన్‌తోఫా, గలాన్‌పథకం, మైనార్టీ రుణాలు రద్దు, ఈద్గాల అభివృద్ధి నిధులు ఆపేశారన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన విదేశీ విద్యా విధానం నీరుగార్చారని తెలియజేశారు. హయాద్ బాష, టపాల్ లియాకత్, ఖాదర్‌భాష, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడు దాడి చేశాడని అన్న ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జనవరి23: తమ్ముడు దాడి చేశాడని పోలీసులకు అన్న ఫిర్యాదు చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు కథనం మేరకు.. మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన రామిరెడ్డికి ముగ్గురు కుమారులు. కొన్నిరోజుల క్రితం రామిరెడ్డి మృతి చెందాడు. తల్లి చిన్న కుమారుడు ఆదినారాయణరెడ్డి వద్ద ఉంటోంది. కొన్ని రోజుల క్రితం తల్లి పెద్దకుమారుడు భువనేశ్వర్‌రెడ్డి ఇంటి చుట్టూ అక్షింతలు చల్లిందని, దాని వల్ల కుటుంబంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తల్లితో భువనేశ్వర్‌రెడ్డి వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆదినారాయణరెడ్డి అన్నపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టిన జగన్: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత నాగరాజు

చిత్తూరు రూరల్, జనవరి 23: సంక్షేమ పథకాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు విమర్శించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్ చెప్పింది ఒకటి ఇప్పుడు చేసేది ఒకటని ఎద్దేవా చేశారు. దశల వారీగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపీనాథ్, సత్యమూర్తి, మణి, విజయగౌరి, రమాదేవి, కోమల తదితరులు పాల్గొన్నారు.

28న జంబు మహర్షి విగ్రహావిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వన్నియర్ కుల సంఘ నేతలు

చిత్తూరు, జనవరి 23: ఈ నెల 28న చిత్తూరులో వన్నియ కులక్షత్రియులకు సంబంధించిన జంబు మహర్షి, వీర రుద్ర వన్నియర్‌ల విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని వన్నియ కుల క్షత్రియ సంఘ నేతలు తెలిపారు. మంగళవారం వన్నియ కుల క్షత్రియ ఎడ్యుకేషన్, డెవలప్‌మెంట్ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపంలో సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షులు కాశీనాయకర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ శశిలు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వన్నియర్లందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు కృపానందం, కట్టమంచి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ రోగులను గుర్తించండి



రోగులతో మాట్లాడుతున్న జేడీ దేవసాగర్

చిత్తూరు రూరల్, జనవరి 23: జిల్లాలో అవగాహన లేకుండా వైద్యానికి దూరంగా ఉన్న లెప్రసీ రోగులను గుర్తించాలని జిల్లా లెప్రసీ అధికారులను ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని లెప్రసీ వార్డు, బీఎస్‌ఆర్ పేట, జీడీనెల్లూరు పీహెచ్‌సీలను ఆయన తనిఖీ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లెప్రసీ రోగుల్లో కాళ్లు, చేతులు వంకర్లుపోయిన వారిని గుర్తించి వారికి ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా లెప్రసీ నివారణ అధికారి వెంకటప్రసాద్, లెప్రసీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం, పీడీ

ఐరాల(కాణిపాకం), జనవరి 23: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థి నిత్యశ్రీ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కోమల తెలిపారు. ఇటీవల నందికొట్కూరులో నిర్వహించిన జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఈ విద్యార్థి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆమె చెప్పారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో నిర్వహించే పోటీలలో పాల్గొనన్నున్నట్లు హెచ్‌ఎం తెలియజేశారు. విద్యార్థినిని, పీడీ దేవాను ఉపాధ్యాయులు అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తంబయ్య



డాక్టర్ థామస్‌తో టీడీపీలో చేరిన తంబయ్య తదితరులు

కార్వేటినగరం, జనవరి 23: కార్వేటినగరం మండలానికి చెందిన వైసీపీ నేత తంబయ్య, ఆయన సోదరుడు వేణుతో కలిసి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చెంగల్ రాయల్ యాదవ్, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు నాగేశ్వరరాజు, బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తప్పనిసరి

వెదురుకుప్పం, జనవరి 23: అభివృద్ధి ఫలాలు పొందడానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తప్పనిసరి అని వెదురుకుప్పం ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంపై సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ పరిపాలనలో ప్రజల గ్రామ భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి వనరుల సద్వినియోగానికి ప్రణాళికలు అవసరమని చెప్పారు. సమావేశంలో ఏవో హరినాథ్‌బాబు, ఈవోపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, మండల ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

ఆళ్లమడుగులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సంక్షేమ పథకాల ప్రదర్శనను చూస్తున్న అధికారులు, నాయకులు

వెదురుకుప్పం, జనవరి 23: మండలంలోని ఆళ్లమడుగులో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వీడియో ప్రదర్శన నిర్వహించారు. క్యాలెండరును ఆవిష్కరించారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, కామసాని దామోదరరెడ్డి, డీడీవో మోహన్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రవీణ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

కార్వేటినగరం, జనవరి 23: డీఎం పురం జడ్పీ హైస్కూల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాట సాధనలో ఆయన చేసినా సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు







చిత్తూరులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న గురజాల జగన్మోహన్, తవణంపల్లెలో అన్నదానం, నగరిలో భానుప్రకాష్‌కు కేక్ తినిపిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 23: జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, సీఆర్ రాజన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, గురజాల జగన్‌మోహన్, కోదండ యాదవ్, సుబ్రమణ్యం నాయుడు, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, హేమాద్రి నాయుడు, సీఎం విజయ, అశోక్, శంకర్, దుర్గాచౌదరి, రాజశేఖర్, శశికర్ బాబు, మేషాక్, రఘు, రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ అశోక్.. మాజీ కార్పొరేటర్ వసంత్ ఆధ్వర్యంలో చిత్తూరులో పలు కార్యక్రమాలు చేపట్టారు.

జీజేఎం ఆధ్వర్యంలో..

జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు, అల్పాహారం అందించారు. పీసీఆర్ కళాశాల వద్ద, తపోవనం ఆశ్రమంలో అన్నదానం చేశారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. చిరు వ్యాపారులకు 70 తోపుడు.. పానీపూరి బండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తవణంపల్లె: తెల్లగుండ్లపల్లె, తవణంపల్లెలో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తవణంపల్లెలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. పార్టీ పరిశీలకులు శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ ఎంపీపీ సరళకుమారి, వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవి, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోహన్ నాయుడు, సునీల్, పూతూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, నాయకులు మధు, శరవణ, దాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. నేతలు జయదేవ నాయుడు, చల్లా, ఏకాంబరం, అరుణ్, కిట్టు, శివలింగారెడ్డి, జయరామ యాదవ్, రవి నాయుడు, కొత్తపల్లె బాబు, కనకనేరి రవి, దొరబాబు, గోవిందగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అన్నా క్యాంటీన్ వద్ద అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, లోకనాథం నాయుడు, హేమచంద్ర నాయుడు, వంశీచౌదరి, రమేష్, హరిప్రసాద్, జాకీర్, ఆరీఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: పాతపాళ్యంలో మండల టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు, సన్నపనేని వెంకటేశ్ ఆధ్వర్యంలో 25 కేజీల కేక్‌ను కట్ చేశారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జయచంద్రయ్య, నటరాజ్, అరుణ్‌కుమార్, జలీల్‌బాషా, ప్రసాద్, లోకయ్య, గుర్రప్ప నాయుడు, శివ, జనసేన నాయకులు పూలప్రభాకర్, మునిరాజులు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారీ కేక్ కట్ చేశారు. మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు కాంతారావు, గణపతి నాయుడు, సీకే చిట్టి, చంద్రమౌళి, హిమగిరి నాయుడు, హేమాద్రి నాయుడు, ఊట్ల నాగరాజు, చిరంజీవి, గురుస్వామి, హిమకర్, ప్రమోద్, రామానుజం, ఏకాంబరం, దేవరాజులు నాయుడు, రామమూర్తి నాయుడు, హరి, సుబ్బరాజులు తదితరులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

కార్వేటినగరం: కార్వేటినగరం వృద్ధాశ్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. మండల టీడీపీ అధ్యక్షులు చెంగల్‌రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, నాగేశ్వర రాజు, నాయకులు త్యాగరాజు, రవియాదవ్, జగన్నాథం, నటరాజు, కేజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవి నాయుడు, బాబు యాదవ్, ప్రకాష్, మనోజ్ యాదవ్, జగన్, పరదేశి, సంపూర్ణమ్మ, మణిరెడ్డి, రమేష్, మహేష్, కాశేశ్వరరావు, నట్టేరి క్రిష్టయ్య, మురళీ నాయుడు, ఉమాపతి పిళ్లై, పెరుమాల్ రెడ్డి, గాలి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: పాతగుంటలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి, నాయకులు వెంకటరత్నంశెట్టి, గాలి నాదముని నాయుడు, మునిజ్యోతి, బాబురెడ్డి, రామచంద్రారెడ్డి, దేవేంద్రరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలసముద్రం: ఆముదాలలో ధర్మరాజుల ఆలయంలో లోకేశ్ కుటుంబ సభ్యులపేర్లపై టీడీపీ నాయకులు పూజలు చేయించారు. భీమినేని చిట్టిబాబు నాయుడు కేక్ కట్ చేశారు. నేతలు శేఖర్ రాజు, వాసు నాయుడు, బాలాజీ నాయుడు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు నాయుడు, శ్రీనురాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్‌ఆర్‌పురంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. నాయకులు కుప్పయ్య, జయచంద్ర, లోకనాథం, దేవేంద్ర, అయ్యప్ప, దేవరాజులు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.



జీడీ నెల్లూరులో కేక్ కట్ చేస్తున్న థామస్

నగరి: నగరి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ కేక్ కట్ చేసి, కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, నేతలు శివశంకర్‌రెడ్డి, రమేష్‌రాజు, వెంకటేశ్వరరావు, జీవరత్నం నాయుడు, గంజి మాధవయ్య, మీరా, బాలాజీ, శ్రీనివాసన్, అల్లిముత్తు, మురళి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

యాదమరి: యాదమరిలో మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ ఆధ్వర్యంలో పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, నాయకులు చిట్టి నాయుడు, వినాయకం గౌండర్, గుణశేఖర్, నాగరాజు, రాజమాణిక్యం, పట్టాభి, మునీర్, పూర్ణ, కుప్పుస్వామి, వేణు నాయుడు, చిత్ర, మురుగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరులో ఇన్చార్జి థామస్, మండల అధ్యక్షులు స్వామిదాస్, నియోజకవర్గ పరిశీలకులు రవిప్రకాష్‌తో పాటు నాయకులు కేక్ కట్ చేశారు. పెనుమూరు మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీదర్‌యాదవ్, వెంకటేశ్, దేవసుందరం, జ్యోతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో మాజీ మంత్రి కన్నా

ఐరాల(కాణిపాకం), జనవరి 23: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశంయాదవ్ మంగళవారం దర్శించుకున్నారు. వారిని ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు, జనవరి 23: స్కూటర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఒంటిల్లు వద్ద మంగళవారం చోటుచేసుకుంది జరిగింది. మండలంలోని వేపనపల్లి గ్రామానికి చెందిన మునిరామయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో ఆయన ఒంటిళ్లు నుంచి సచివాలయం వద్దకు వెళ్ళేందుకు రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చిత్తూరువైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం చీలాపల్లి సీఎంసీకి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబు ష్యూరిటీని కించపరచడం తగదు

గంగాధరనెల్లూరు, జనవరి 23: టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసీపీకి చెందిన వారు కించపరచడం తగదని పార్లమెంటు టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ శరవణకుమార్, పెద్దకాల్వ పంచాయతీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు కె.ఎం.సునీల్, టీడీపీ బూత్ కన్వీనర్ దీపక్ నాయుడు, మండల టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు లోకమ్మ, నేతలు గాయత్రి యాదవ్, లక్ష్మయ్య, భువనేశ్వరి తీవ్రంగా ఖండించారు. చెర్లోపల్లిలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తుంటే వలంటీరు, వైసీపీ నేతలు దబాయించడం, అసత్య ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు.

ఉగ్రాణంపల్లిలో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, జనవరి 23: మండలంలోని సామిరెడ్డిపల్లి పంచాయతీ ఉగ్రాణంపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు బీపీ, షుగర్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 68 మందిని కళ్లజోడుకు ఎంపిక చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్లు అనిల్‌కుమార్, హర్షవర్ధన్, రాజశేఖర్, మీనాసయ్యద్, డీడీవో మనోరంజనీ, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, జనవరి 23: నగరంలోని రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఈనెల 28న ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుపతి అరవిందో నేత్ర వైద్యశాల డాక్టర్లచే ఉచితంగా కంటి పరీక్షలు, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

351వ రోజుకు చేరిన అన్నక్యాంటీన్

చితూరు సిటీ, జనవరి 23: స్థానిక కొంగారెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 351వ రోజుకు చేరింది. మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నేత నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, శివాజి, హరి, వెంకటేష్, గోపాల్, హరిత పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

గుడిపాల, జనవరి 23: ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలను కేటాయించాలని వసంతాపురం పంచాయతీ పసుమంద కాలనీవాసులు మంగళవారం తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు విన్నవించారు. గత కొన్ని సంవత్సరాలుగా స్థలాల్లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికితీసుకొచ్చారు. స్పందించిన తహసీల్దార్, సర్పంచ్ రజనీకాంత్ వీలైనంత త్వరలో సర్వే చేసి స్థలాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లెలో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంఈవో దామోదరం

పాలసముద్రం, జనవరి 23: ఎస్‌ఆర్ కండ్రిగ, పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, ఆముదాల, తిరుమలరాజుపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులచేత ఉపాధ్యాయులు మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకే పాఠశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఆర్పీలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం: పన్నూరు, గంగమాంబాపురం, విజయపురం, జంబాడ, శ్రీహరిపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మాక్ పోలింగ్ నిర్వహించారు. విజయపురంలో మాక్ పోలింగ్‌ను ఎంపీడీవో చంద్రమౌళి సందర్శించి, సూచనలు ఇచ్చారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకిరామరెడ్డి, గోవిందస్వామి, శ్యామల, శ్రీనివాసులు, సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపాల: నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్‌ను తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో రామ్ నాయక్, గణపతి, పీఆర్ ఏఈ జయచంద్ర, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం లక్ష్మీ నరసింహ విద్యా సంస్థల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై నిర్వాహకులు దిలీప్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, పొలిటికల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. అధ్యాపకులు సుబ్బారావు, హరిబాబు, బాబు, కార్తీక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవిన్యూ అధికారులు మాక్ పోల్ నిర్వహణ ద్వారా ఓటు హక్కు వినియోగించుకొనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, డీటీ వెంకటరమణ, ఎంఈవోలు ప్రేమలత, త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింద్ర: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో శ్రీధర్ రాజు, వసుమతి దేవి, ఎంపీడీవో అరుణ, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, హెచ్‌ఎం శివయ్య పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు మధు, బాలు, కామేశ్వరావు, మన్మధరావు, రాజేష్, వెంకటరమణ, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు, ఉగ్రాణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దారు కళావతి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎంలు మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోల్ నిర్వహించారు. విద్యార్థులే పీవో, ఏపీవో, ఓపీవోలుగా, పోలింగ్ ఏజెంట్లుగా, ఓటర్లుగా వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎంఈవో దామోదరం తిరుమలయ్యపల్లె మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

నగరి: మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాక్ పోలింగు నిర్వహించారు. ఎంఈఓ శ్రీదేవి, యూటీఎఫ్ నాయకులు మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎంఈవో ఆంజనేయులుశెట్టి, హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, యుగంధర్‌ఆచారి పాల్గొన్నారు.

విద్యార్థులు పీఏఎల్ ల్యాబ్ తప్పక వినియోగించాలి



టీచర్లకు పీఏఎల్ ట్యాబ్‌లను అందిస్తున్న అధికారులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 23: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పర్సనలైజ్డ్ అడ్యాప్టివ్ లెర్నింగ్ ల్యాబ్ (పీఏఎల్) లను విద్యార్థులు తప్పక వినియోగించాలని పీఏఎల్ స్టేట్ నోడల్ అధికారి కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీఈవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఈవో విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మ్యాథ్స్ టీచర్లకు పీఏఎల్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ నోడల్ అధికారి మాట్లాడుతూ గణితం అభివృద్ధి కోసం విద్యార్థులు ప్రతి రోజు ఒక్క పీరియడ్ పీఏఎల్ ల్యాబ్‌ను వినియోగించేలా వారిలో చైతన్యం నింపాలన్నారు. జిల్లాలోని 64 పాఠశాలల్లో తొలి దశలో వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందుకోసం రూపొందించిన ట్యాబ్‌లు విద్యార్థులకు తగిన జ్ఞానాన్ని పెంచుతుందన్నారు. డీసీఈబీ కార్యదర్శి హేమారెడ్డి, ఎంఐఎస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ జయప్రకాష్, టీచర్లు పాల్గొన్నారు.

ఎమోషనల్ బ్రిడ్జిపై అధ్యాపకులకు శిక్షణ

నగరి, జనవరి 23: ఎమోషనల్ బ్రిడ్జిపై జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు మంగళవారం నగరి డిగ్రీ కళాశాలలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సాంకేతికంగా విద్యార్థులు మెరుగైన విద్యను అందుకోవడానికి, ఒత్తిడిని అధిగమించి మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి నిపుణులు శోభితారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా విద్యాధ్యయనం చేయడానికి విలువలతో కూడిన విద్యను అందుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యాపకులకు వివరించారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

పాలసముద్రం, జనవరి 23: మండలంలోని 13 పంచాయతీలకు అన్‌టైడ్ రెండో విడత నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. 13 పంచాయతీలకు గాను రూ. 48,03,786 మంజూరయ్యాయన్నారు. పాలసముద్రం పంచాయతీకి రూ.8,68,604, వనదుర్గాపురంకు రూ.2,63,100, ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగకు రూ.1,61,382, క్రిష్ణజిమ్మాపురంకు రూ.4,09,225, శ్రీకావేరిరాజుపురంకు రూ.4,12,319, వెంగళరాజుకుప్పంకు రూ.7,73,265, ఆముదాలకు రూ.5,71,850, బాలక్రిష్టాపురంకు రూ.3,95,195, తిరుమలరాజుపురంకు రూ.2,68,164, నరసింహాపురంకు రూ.4,41,889, కోదండరామాపురంకు రూ.49,054, గంగమాంబాపురంకు రూ.2,45,991, సింహరాజుపురం పంచాయతీకి రూ.2,43,748 చొప్పున ఆయా పంచాయతీల సర్పంచ్ ఖాతాలకు నిధులు జమ అయ్యాయని ఎంపీడీవో తెలిపారు.

నిరుపేదల ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్

గుడిపాల, జనవరి 23: నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నామని మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. మంగళవారం 184వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం సర్పంచ్ గుర్రప్ప నాయుడు, మాజీ సర్పంచ్ రవి నాయుడు, టీడీపీ నేతలు ఏకాంబరం, హైజాక్, సుధాకర్ యాదవ్, బాబు, రవి, చల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డులో ప్రయాణం ఎలా..?



అధ్వాన్నంగా వున్న సింహరాజుపురం - వినాయకపురం రోడ్డు

పాలసముద్రం, జనవరి 23: మండలంలోని సింహరాజుపురం నుంచి వినాయకపురం వయా అమ్మియార్ కుప్పం వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుకు గత నాలుగు సంవత్సరాలుగా మరమ్మతులు చేయకపోవడంతో వర్షాలకు కోసుకుపోయి కాలువలా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. ఈ మార్గంలో పాదచారులు వెళ్ళడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నా పంచాయతీలో నిధులు లేవని పంచాయతీ అధికారులు అంటున్నారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులైనా మరమ్మతులు చేయాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

కంపు బాబోయ్ కంపు..!



చిత్తూరు-పుత్తూరు జాతీయ రోడ్డుపై కోళ్ల వ్యర్థాలు

శ్రీరంగరాజపురం, జనవరి 23: ఎస్‌ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లె మిట్ట చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై కోళ్ల షాపుల్లోని వ్యర్థాలను వేయడంతో ఆ రహదారిపై వెళ్లే వాహదారులు కంపును భరించలేకపోతున్నారు. అదే విధంగా కోళ్ల వ్యర్థాలను తినడానికి కుక్కలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. కోళ్ల షాప్ యజమానులు కోళ్ల వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.